ప్రజాశక్తి
సోమవారం 27 జనవరి 2025
పార్వతీపురం మన్యం

జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కోఆర్డినేటర్ గా పనిచేస్తున్న ఆర్. వెంకట మహేష్ ఉత్తమ సేవలు అందించినందుకు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదగా అవార్డు అందుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలకు సమున్నత స్థానం

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్

జెండా వందనం చేస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లాలోని అభివృద్ధి సంక్షేమం అన్ని వర్గాల ప్రజలకు అందేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా అధికారుల ఆధ్వర్యాన అత్యంత వైభవంగా నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా పోలీసు రక్షక దళాలు, సిఆర్‌ఎఫ్, ఎన్‌సిసి క్యాడెట్లు, హెూమ్ గార్డ్స్ చేసిన విన్యాసాలు, మార్చ్ ఫాస్టు, గౌరవ వందనం తదితర అధికారిక ప్రక్రియల నడుమ గణతంత్ర వేడుకలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. తొలుత వేదికకు చేరుకున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి స్వాగతం పలుకగా కలెక్టర్ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలోని పోలీసు దళం కలెక్టర్‌కు సెల్యూట్ సమర్పించగా, బ్యాండ్ బృందం జాతీయగీతాన్ని ఆలపించింది. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు కలెక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని కలెక్టర్ స్వీకరించారు. అనంతరం అతిథి సభా వేదిక వద్దకు చేరుకోగా పోలీసు దళాలు కవాతు నిర్వహించాయి.

అనంతరం కలెక్టర్ జిల్లా ప్రగతి నివేదికను సభా వేదిక నుంచి చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లాలో పలు అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అర్హులైన వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందజేశామని పేర్కొన్నారు. అటు అభివృద్ధిలోనూ, ఇటు సంక్షేమంలోనూ అన్ని వర్గాలకు సమున్నత స్థానం కల్పించామని వివరించారు. సమ్మిళిత విధానాలతో అన్ని వర్గాల ప్రయోజనాలకు పెద్దపీట వేశామని, ఎన్నో అంశాల్లో విశేషమైన ప్రగతి సాధించామని ఉద్ఘాటించారు. బలహీన వర్గాల వారికి అండగా ఉన్నామని, మహిళలకు అన్ని విధాలా తోడుగా నిలిచామని కలెక్టర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, జిల్లాలో చేపడుతున్న పలు అభివద్ధి కార్యక్రమాల గురించి తన సందేశంలో వివరించారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డాగ్ షో

బిందు, లైకా, శాండీ పేరు గల పోలీసు జాగిలాలు (డాగ్స్) చేసిన ప్రదర్శన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగా బిందు జాగిలం జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్చాన్ని అందజేసి, సెల్యూట్ చేయగా, లైకా జాగిలం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డికి పుష్పగుచ్చాన్నిఅందించి సెల్యూట్ చేసింది. అనంతరం బిందు, శాండీ, లైకా చేసిన ప్రదర్శనలు ఆహూతులను ఆద్యంతం అలరించాయి.

జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు చేసిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, జిల్లా యంత్రాంగం సాధించిన ప్రగతి అంశాలను తెలుపుతూ సాగిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, వివిధ దళాల అధికారులు, న్యాయ వ్యవస్థ ప్రముఖులు, పోలీసు అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం, వివిధ సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవా కార్యకర్తలు, పాత్రికేయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రతిభా పురస్కారాలు ప్రదానం

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 487 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

స్టాళ్లను సందర్శించిన కలెక్టర్

గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. సూక్ష్మ నీటిసాగు పథకం, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, సమగ్ర గిరిజనాభివద్ధి సంస్థ, మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయ, సంప్రదాయ పంటల ఉత్పత్తి తదితర శాఖలు స్టాళ్లను ఏర్పాటుచేయగా ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, డిపిఆర్ఒ ఎల్.రమేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి టి.కనకదుర్గ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభుత్వ శకటాలు

76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి ఎస్.వి. మాధవ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ తదితర అధికార యంత్రాంగం సమక్షంలో 13 ప్రభుత్వ శాఖలు పది శకటాలను ప్రదర్శించాయి. ఇందులో వ్యవసాయ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పంచాయతీ రాజ్, జలవనరులు, రహదారులు - భవనాలు, గ్రామీణ నీటిసరఫరా, ఐటిడిఎ, పాఠశాల విద్య, డి.ఆర్‌డిఎ - వెలుగు, విద్యుత్, అగ్నిమాపక శాఖల శకటాలు ప్రదర్శనలో ఉన్నాయి. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న అభివద్ధి, సంక్షేమ పథకాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. వీటిలో పాఠశాల విద్యా శాఖ ఏర్పాటుచేసిన శకటం ప్రథమ స్థానం దక్కించుకోగా, పంచాయతీ రాజ్, జలవనరులు, ఆర్ అండ్ బి, గ్రామీణ నీటిసరఫరా విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన శకటం ద్వితీయ స్థానం, ఎపిఇపిడిసిఎల్ శకటం తృతీయ స్థానంలో నిలిచింది. కాగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికైన శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ సమైక్యతను చాటి చెప్పాయి. పార్వతీపురం విద్యార్థులు చేసిన స్వాగతం... స్వాగతం శాస్త్రీయ స్వాగత నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. రింగ్ రింగ్ నరేన గీతానికి బడ్డుమాసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆధ్యాంతం ఆకట్టుకోగా, జయహెూ గీతానికి సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భామిని కెజిబివి విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం గిరిజన సంస్కృతిని ప్రతిబింభించగా, దేశ్‌కీ రంగీల, వందేమాతరం గీతాలకు సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు జాతీయ సమైక్యతకు దర్పణంగా నిలిచాయి. గుమ్మలక్ష్మీపురం కెజిబివి విద్యార్థులు ప్రదర్శించిన జయహెూ గీతానికి చేసిన పిరమిడ్స్ ఆధ్యంతం అలరించాయి. అనంతరం సాంస్కతిక ప్రదర్శనలు ప్రదర్శించిన కళాకారులకు, చిన్నారులకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పి మాధవ్‌రెడ్డి, ఏఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, జెసి ఎస్.ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ట్రైకార్ కార్పొరేషన్ సంచాలకులు పువ్వల లావణ్య, కాపు కార్పొరేషన్ సంచాలకులు గండి రామి నాయుడు, కొప్పులవెలమ కార్పొరేషన్ సంచాలకులు గొట్టాపు వెంకట నాయుడు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ప్రథమ బహుమతిని గెలుచుకున్న విద్యాశాఖ శకటం

పార్వతీపురంలో నిరసననుద్దేశించి మాట్లాడుతున్న రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ దాసు, పాలకొండలో ర్యాలీ చేస్తున్న కార్మిక, రైతుసంఘాల నాయకులు

కేంద్రం రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతులు చేస్తున్న పోరాటాలను ఏ మాత్రం పట్టించు కోకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వెళ్తే తీవ్ర పరిణామలు తప్పవని హెచ్చరించారు. రైతు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన అమలు కు పూనుకున్న రైతు వ్యతిరేక నల్ల చట్టాలను, లేబర్ కోడ్‌లను ఉపసంహరించు కోవాలని, ఎంఎస్ స్వామి నాథన్ సిఫార్స్ ను అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి వేతనం, పని దినాలు పెంచాలన్నారు. పెరుగుతున్న ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వమే సమర్థవంతంగా నడపాలని కోరారు. స్థానిక పాత బస్‌స్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ప్రదర్శనలో రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బంటు దాసు, సభ్యులు బుడితి అప్పల నాయుడు, మోనంగి భాస్కర్ రావు, బొత్స నర్సింగ రావు, పి.సంగం, పాలక రంజిత్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, నాయకులు రెడ్డి వేణు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోలా రమణి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పెడలా భాస్కర్ రావు, సిఐటియు జిల్లా కార్యదర్శులు వై.మన్మథరావు, బివి రమణ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.ఇందిరా, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ జిల్లా నాయకులు విశ్వేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు వంగల దాలినాయుడు, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ రైతు, కార్మిక సంఘాల సమన్వయ సమితి పిలుపుమేరకు స్థానిక దుర్గ గుడి జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాద్‌రావు తదితరులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు రైతు మెడకు ఉరితాడులా కేంద్రం నూతన చట్టాలు, కార్మిక లేబర్ కోడ్ అమలు, కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల్ని వ్యతిరేకించండి, ఐక్య పోరాటాలు ఉదతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు కె.చిట్టిబాబు, జి.కృష్ణ, ఎం.అప్పన్న, కె.రాము, డి.దుర్గారావు, వీరమనాయుడు, ఎ.భానుచందర్, వై.శ్రీనివాసరావు, సిహెచ్ సంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : రైతులకు అన్ని విధాలుగా భరోసా కల్పించాలని, దేశాన్ని కార్పొరేట్ల, మతోన్మాదుల నుంచి కాపాడుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, రైతు సంఘం నాయకులు ఉపేంద్ర మండలంలోని దేవుకోన పంచాయతీ బంగారంపేట వద్ద ట్రాక్టర్, ఎడ్ల బండితో అంతరాష్ట్ర రహదారి పైన ర్యాలీ అనంతరం నిరసన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతు, కార్మికుల హక్కులు హరించేలా నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేసే విధంగా ఆలోచించడం దుర్మార్గమన్నారు. ఇలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలంతా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలనాయుడు, గిరిజన సంఘము నాయకులు వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

అన్న వెంటే తమ్ముడు..

ఆరు గంటల వ్యవధిలో మృతి

అప్పలనాయుడు

సింహాచలం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆరు గంటల వ్యవధిలో అన్నాదమ్ముళ్లు మృతి చెందిన సంఘటన మండలంలోని పులిగుమ్మిలో ఆదివారం జరిగింది. ఈ గ్రామానికి చెందిన మడక అప్పలస్వామి (90) ఇటీవల భార్యను కోల్పోయి, పిల్లలు లేకపోవడంతో తమ్ముడు సింహాచలం పోషణలో ఉంటున్నాడు. అయితే శనివారం రాత్రి అన్న అప్పలస్వామి మృతి చెందడంతో ఆయనకు దహన సంస్కారాలు జరిపేందుకు సన్నాహాలు చేస్తుండగా ఇంతలో తమ్ముడు సింహాచలం కూడా హఠాత్తుగా మరణించడంతో గ్రామంలో కలకలంతో పాటు దుఃఖ వాతావరణం నెలకొంది. అందరికీ ఆదర్శంగా ఉండే అన్నదమ్ములు 6 గంటల కాలంలోనే మృతి చెందడంతో గ్రామస్తులు విస్మయం చెందారు. ఆదివారం ఉదయం వారి ఇరువురికి పక్కపక్కనే దహన సంస్కారాలు నిర్వహించారు. చావులోనూ ఒకరికొకరు తోడుగా ఉన్న అన్నదమ్ముల అనుబంధాన్ని బంధువులు గుర్తు చేసుకుంటూ దుఃఖిస్తున్నారు. సర్పంచి బేత బాల కుమారి, వెంకటరమణ మృతుల కుటుంబానికి బాసటగా నిలిచి తదుపరి కార్యక్రమాలు నిర్వహించారు.

పోలమాంబ సంబరానికి సర్వం సన్నద్ధం

- నేడు తొలేళ్ల ఉత్సవం
- రేపు సిరిమాను సంబరం
- 700 మంది పోలీసులతో బందోబస్తు

శంబర పురవీధుల్లో తిరుగుతున్న ఘటాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి సంబరానికి సర్వం సన్నద్ధమైంది. సోమవారం తోలేళ్ల ఉత్సవం, మంగళవారం సినిమానోత్సవం, బుధవారం అంతకోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు దేవాదాయ శాఖ యాత్రికుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇఒ వివి సూర్యనారాయణ పర్యవేక్షణలో గతం కంటే మెరుగైన రీతిలో ఏర్పాట్లను చేపట్టారు. ప్రధానంగా చదును గుడి పరిసరాల్లో పటిష్ట క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఈసారి జరిగిన అభివృద్ధి పనులు జాతరకు కొత్త శోభను తెచ్చిపెట్టింది. గోముఖీ నదీ తీరంలో సుందరమైన ప్లాట్‌ఫారం నిర్మాణంతో భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. యాత్రికులు తమ వాహనాలు, బస్సులను దిగిన నుండి అమ్మవారి గుడికి చేరే వరకు కాళ్లకు మట్టి అంటకుండా రోడ్లు ఏర్పాటు చేశారు. చదురు గుడి వెనుక భాగం వాతావరణం అంతా విశాలంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునే అవకాశం దక్కనుంది

700 మంది పోలీసు బందోబస్తు

మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పర్యవేక్షణలో ఎఎస్పీలు దిలీప్ కిరణ్, అంకిత సురానాల ఆధ్వర్యంలో 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును జాతర సందర్భంగా ఏర్పాటు చేశారు. రోప్ పార్టీ, షీ టీం, మఫ్టీ పోలీసులతోనూ, అలాగే డ్రోన్ కెమెరాతో పటిష్టంగా నిఘా ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలిలో యూనిఫాంతో కూడిన పోలీసులను నియమించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టనున్నారు

యథావిధిగా ఆర్టీసీ ఛార్జీలు

జాతర సందర్భంగా యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి నడిపే ప్రత్యేక బస్సులకు ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా యథావిధి ఛార్జీలతో నడుపుతున్నట్లు సాలూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎ.భాస్కర్ రెడ్డి విలేకరులకు తెలిపారు. సాలూరు నుంచి మామిడిపల్లి మీదుగా 55 బస్సులు నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

వాహన'దారులు '...ఇలా..

పార్వతీపురం, బొబ్బిలి మీదుగా పోలమాంబ జాతరకు వాహనాల ద్వారా వచ్చే భక్తులు పోలీసులు నిర్దేశించిన చోట మాత్రమే పార్కింగ్ చేయాలని ఎస్సై వెంకటరమణ తెలిపారు. మక్కువ నాలుగు రోడ్ల సెంటర్ నుంచి చెముడు మీదుగా మూడు, నాలుగు చక్రాల వాహనాల ద్వారా వచ్చే వ్యక్తులు శంబర చేరుకోవాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలపై వచ్చే యాత్రికులు కవిరిపల్లి మీదుగా వెళ్లేందుకు అనుమతిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయా ప్రాంతాల్లో నిర్దేశించిన పార్కింగ్ స్థలాల వద్ద మాత్రమే వాహనాలను నిలపాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులు ఈ విధంగా పోలీసులు నిర్ణయించే సూచనలను పాటిస్తూ సహకరించాలని ఆయన కోరారు.

యాత్రకు సిద్ధం చేస్తున్న లడ్డూలు

నేడు తొలేళ్ల సంబరం

పోలమాంబ అమ్మవారి జాతర తొలిరోజైన సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం జరుపనున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ధాన్యాన్ని తీసుకొచ్చి సావిడ వీధిలో రాసిగా పోస్తారు. అప్పటికే గ్రామంలో తిరుగాడిని ఘటాలు ఆ రాశి వద్దకు చేరుకున్న అనంతరం ఘటాలు తోలేరు పోసి ధాన్యపురాశులపై అమ్మవారు తొక్కుతారు. అమ్మవారి పాదాలతో తొక్కబడిన ధాన్యపురాశులను గ్రామస్తులు ఒక్కొక్కరుగా తాము తెచ్చిన విధంగా మళ్లీ తీసుకుపోయి ఆ ధాన్యాన్ని అక్షితలుగానూ, ఇంట్లో ఉన్న ధాన్యంలో కలుపుతారు. అనంతరం పంటల సమయంలో ఆ ధాన్యాన్ని విత్తన రూపంలో పొలాల్లో చల్లుతారు. ఇలా చేయడం వల్ల తమ పంటలు బాగా వృద్ధి చెందుతాయని గ్రామస్తులు విశ్వసిస్తారు ఈ తొలేళ్ల ఉత్సవ లో స్థానిక యాదవ కులస్తుల పాత్ర కీలకమైనదిగా చెబుతుంటారు. అలాగే పెదగైశీల నుంచి నాయుడు కుటుంబీకులు కూడా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం బాణా సంచల కాల్చుతూ ఉంటారు. దీంతో తోలేళ్ల ఉత్సవం ముగియనుంది.

టిక్కెట్లు ధరలు యథా విధం

జాతర సందర్భంగా వచ్చే యాత్రికులు అమ్మవారి దర్శనం కోసం నిర్ణయించే టికెట్లలో ఎటువంటి మార్పు లేదని, గతం మాదిరిగానే టికెట్ ధరలను నిర్ణయించామని ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనానికి వంద రూపాయలు శీఘ్ర దర్శనానికి 20 రూపాయలు టికెట్ ధరను నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే రూ.లడ్డు 15, పులిహోరా రూ.10గా నిర్ణయించినట్టు తెలిపారు. అమ్మవారి ప్రసాదాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక కౌంటర్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

శంబర యాత్రకు 130 ప్రత్యేక బస్సులు

పార్వతీపురం టౌన్ : మక్కువ మండలం శంబర పోలమాంబ యాత్రకు యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈనెల 27, 28,29 తేదీల వరకు 130 ప్రత్యేక బస్సులు వేసినట్టు డిపో మేనేజర్ దుర్గ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న పార్వతీపురం డిపో నుండి 5, సాలూరు డిపో నుండి 10, 28న పార్వతీపురం డిపో నుండి 25, సాలూరు డిపో నుండి 25, పాలకొండ డిపో నుండి 10, ఎస్ కోట డిపో నుండి10, విజయనగరం డిపో నుండి 20, శ్రీకాకుళం డిపో నుండి 10, 29న పార్వతీపురం డిపో నుండి 5 సాలూరు డిపో నుండి 10 ప్రతేక బస్సులను వేశామన్నారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, విజయనగరం, ఎస్ కోట, శ్రీకాకుళం ఆర్టీసీ డిపోల నుంచి శంబర వరకు వయా చినబోగిలి, దిబ్బగుడివలస, మామిడిపల్లి, వైఎస్ వలస మీదుగా ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నామని, యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు

జిఒ 3 పునరుద్ధరణకు దశల వారీ పోరాటం

ప్రజాశక్తి - కురుపాం

జిఒ 3 పునరుద్దనకు దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ పిలుపునిచ్చారు. మండలంలో పి.లేవిడి రబ్బర్ తోటలో యుటిఎఫ్, గిరిజన సంఘం, భాషా వాలంటీర్లు, సిఆర్టిలతో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 3ను సాధించకపోతే గిరిజన ప్రాంతంలో గిరిజన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని, కావున దశలవారీ పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి మాట్లాడుతూఉద్యోగ సంఘాల పక్షాన తాను నిరంతరం పోరాడుతున్నానని ఎమ్మెల్సీ గెలిపిస్తే జీవో 3 పునరుద్దనకు సాధనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశం గిరిజన సంఘం, యుటిఎఫ్, సిఆర్‌టి, భాష వాలంటరీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్

ప్రజాశక్తి సీతానగరం

కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డుఅందుకుంటున్న సర్పంచ్ సత్యంనాయుడు దంపతులు

మండలంలోని రామవరం పారిశుధ్యం, జలజీవనం వంటి పది సూత్రాల అమలులో మొదటి స్థానం సంపాదించి దేశ వ్యాప్తంగా ఉత్తమ పంచాయతీ ఎంపికైంది. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ రోజున కేంద్ర మంత్రి పంచాయతీరాజ్ సహాయ మంత్రి ద్వారా గ్రామ సర్పంచ్ పి.సత్యంనాయుడు దంపతులు, పంచాయతీ కార్యదర్శి ఎ.శిశుభూషణరావుకు ఈరోజు అవార్డులను అందజేశారు. ఈ అవార్డులు అందుకోవడంతో మండల అధికారులు, ఎమ్మెల్యే, మంత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు

జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

స్థాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఆదివారం స్థానిక టిడిపి మండల కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో గల ఐదు మండలాల్లో 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం జాబ్‌మేళాను నిర్వహిస్తుందని అన్నారు. కావున ఈ అవకాశాన్ని యువత వినియోగించుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కె.వి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు చంద్రక రామకృష్ణ, సుకేష, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి 11 కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి - సాలూరు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని దండిగాం రోడ్డులో గల మహాత్మా జ్యోతిరావు పూలే స్కూల్‌కు రౌండ్ టేబుల్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ 11 కంప్యూటర్లను వితరణ చేసింది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చేతులు మీదుగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కంప్యూటర్లను ప్రిన్సిపల్ ఎం.పెంటయ్య కు అందజేశారు. పేదవిద్యార్ధినులకు ఉపయోగపడేలా ఈ కంప్యూటర్లను రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ అందజేయడం గొప్ప విషయమని మంత్రి సంధ్యారాణి చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఐ.నారాయణరావు, క్లబ్ సభ్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు, మార్కండేయ మూర్తి,సిబి శేఖర్,కె.వెంకటరావు చేతులు మీదుగా 25 మంది అంధులకు రగ్గులను పంపిణీ చేశారు. వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె.సీతారాం, కార్యదర్శి రవితేజ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో అంధులకు రగ్గులను అందజేశారు.

కురుకుట్టి మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

టిడిపి సీనియర్ నాయకులు, కురుకుట్టి మాజీ సర్పంచ్ సీదరపు అప్పారావు శనివారం విజయనగరం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి సంధ్యారాణి ఆదివారం ఉదయం మృతుని స్వగ్రామం సోంపిగామ్ వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అప్పారావు పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పరమేష్, బూస తవుడు, నరసింహారాజు, కోట లక్ష్మణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

కిచ్చాడ పరిసరాల్లో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఏనుగులు గుంపు పంటలను నాశనం చేస్తూ తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వరి, అరటి, చెరుకు తదితర పంటలను నాశనం చేస్తున్నాయని, మనుషుల మీద పడి ఎప్పుడు ఏమి చేస్తాయోనన్న భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల గుంపును జనవాసాల నుంచి దూర ప్రాంతానికి తరలించి తమ పంటలను తమ ప్రాణాలను కాపాడాలని కోరుతున్నామని అన్నారు.

నేడు ట్రైకార్ చైర్మన్ రాక

ప్రజాశక్తి- సీతంపేట

ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బోరగాం శ్రీనివాసులు సోమవారం పర్యటించనున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం పలు గిరిజన గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎంత మేర అందుతున్నాయో తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డైరెక్టర్లు కూడా ఈ పర్యటనలో పాల్గొంటారని ఐటిడిఎ సెక్టోరల్ అధికారులు, ఇతర సిబ్బంది హాజరు కావాలని పిఒ కోరారు.

నేడు మండల స్థాయి అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పూర్తిస్థాయి సమాచారంతో అధికారులంతా హాజరుకావాలని కోరారు.

గిరిజన విద్యార్థులకు ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా అదే పాఠశాలలో ఎలిమెంటరీ విద్యను అభ్యసించిన జి.ఢిల్లీశ్వరరావు ఆయన తండ్రి మాజీ సర్పంచ్ గురుబిల్లి రాజారావు చేతుల మీదుగా 100 మంది గిరిజన విద్యార్థులకు పేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు తనకు తోచిన సహాయం చేయడం ఆనందంగా ఉందని రానున్న రోజుల్లో ఇంకా పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.మిన్నారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు ప్లేట్లు అందజేస్తున్న మాజీ సర్పంచ్ రాజారావు

ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు

పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో జిల్లాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు, ఉద్యోగులకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో (ఎడమ నుంచి కుడి వైపు వరుసగా) జాయింట్ కలెక్టర్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ హేమలత, డ్వామా పీడీ రామచంద్రరావు, జిసిసి డిఎం మహేంద్రకుమార్, వ్యవసాయశాఖాదికారి రాబర్ట్‌పాల్, సివిల్ సప్లయ్ డిఎం శ్రీనివాసరావు, సాంఘికసంక్షేశాఖ డిడి గియాజుద్దీన్ , (కింది వరుసలో) డిఇఒ తిరుపతిరావు, డిఇవిఒ మంజుల వీణ, ఎంవిఐ శశికుమార్, పాచిపెంట ఎంపిడిఒ పాత్రో, పార్వతీపురం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు ఉన్నారు.

వాడవాడలా ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం జిల్లా కేంద్రంలో పాటు జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటిడిఎ వద్ద పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్ద డిఎఫ్ఒ జిఎపి ప్రసూన పతాకావిష్కరణ చేశారు. అలాగే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ విజయలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ కె.రూపేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. టిడిపి కార్యాలయం వద్ద సీనియర్ టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, నాయకులు బార్నాల సీతారాం, పెంకి వేణుగోపాల్, రౌతు వేణు, గుంట్రెడ్డి రవి కుమార్, చంద్రమౌళి జెండా ఎగరవేశారు. నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు జాతీయ జెండా ఎగురవేశారు.

పాలకొండ : పట్టంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్‌డిఒ కార్యాలయంలో సబ్‌కలెక్టరట్ యశ్వంత్ రెడ్డి జెండా ఆవిష్కరించగా, స్థానిక కోర్టులో జడ్జి విజయ మోహన్ రావు, పోలీసు స్టేషన్ వద్ద డిఎస్‌పి ఎం.రాంబాబు, తహశీల్దార్ కార్యాలయం తహశీల్దార్ బాలమురళీకష్ణ, ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో రేంజర్ రామారావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ విజయ రంగారావు, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ సర్వేశ్వరరావు జెండా ఆవిష్కరించారు

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ పి.త్రివిక్రమ రావు, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ జె.ప్రసన్న కుమార్ జెండాలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, ఎంఇఒలు జి.సూర్యదేవుడు, వెంకటరమణ, వైసిపి నాయకులు బి.శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు. ఎంపిటీసీలు సర్పంచులు పాల్గొన్న పాల్గొన్నారు

ఎస్‌పి కార్యాలయంలో ....

పార్వతీపురం రూరల్ : స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణకు పోలీస్ వ్యవస్థ ముఖ్య భూమిక పోషిస్తుంది అని కొనియాడారు.

జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్‌పి సిఐ రంగనాధం, డిసిఆర్‌బి సిఐ రమేష్, సోషల్ మీడియా,సైబర్ సెల్ సిఐ శ్రీనివాస రావు, సిసిఎస్ సిఐ అప్పారావు, ఎఆర్ ఆర్‌ఐలు రాంబాబు, శ్రీనివాసరావు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, ఎస్బి, డిసిఆర్బి, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న డిఎఫ్ఒ ప్రసూన

ప్రశంసాపత్రాలు అందుకున్న సిబ్బందికి అభినందనలు

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న వి.ఉమామహేశ్వరరావు, నిడగల్లు పశువైద్యాధికారి ఎస్.రామారావు, ఎస్ఐ ఎం.రాజేష్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వీరికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వైసిపి కార్యాలయం వద్ద...

పార్వతీపురం టౌన్ : 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైసిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, మండల, పట్టణ, సీతానగరం, బలిజిపేట, మండలాల వైసిపి ఎంపిపిలు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, కౌన్సిల్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో....

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను కమిషనర్ జి.శ్రీనివాసరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల్లో గల సిబ్బంది చేసి సేవలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

జాతీయ జెండా ఆవిష్కరణకు కౌన్సిల్ సభ్యులు గైర్హాజరు

రిపబ్లిక్ డేను పురస్కరించుకొని జరిగిన జెండా ఆవిష్కరణకు పాలకవర్గం కౌన్సిల్ సభ్యులు గైర్హాజరయ్యారు. చైర్పర్సన్ బోను గౌరీశ్వర మాత్రమే హాజరు కాగా, వైస్‌చైర్మన్లతో పాటు వైసిపి, టిడిపి పాలకవర్గం కౌన్సిల్ సభ్యులు హాజరు కాకపోవడంతో పలు విభాగాల అధికారులు, సిబ్బంది బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

మక్కువ : మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఆవరణలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపిడిఒ డిడి స్వరూపరాణి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, ఎంఇఒ పెంట సత్యనారాయణ, ఎపిఒ ఈశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఘనంగా జరిగాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ జి.చంద్రశేఖర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ వేడుకలకు ఎంపిపి బి.ప్రమీల, పి వీరమనాయుడు, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, ఆర్ఐ వెంకటరమణ, పి.తిరుమలరావు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో జరిగాయి. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శివయ్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మల్లికార్జున, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై కె.నీలకంఠం జెండా ఎగరవేశారు. బాలయోగి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఎగరవేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాగేశ్వరరావు జెండా ఎగురవేసి విద్యార్థులకు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ అధికారులుగా ఎంపిడిఒ, ప్రిన్సిపల్

గణతంత్ర దినోత్సవ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా ఎంపిడిఒ ఎం మల్లికార్జునరావు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు, ఆఫీస్ సబాటరినిగా బి.సోములు ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మ వలస తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ పీకరు, మండల పరిషత్ కార్యాయలయం వద్ద ఎంపిడిఒ సంపంగి రమేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలో గల పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు,ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్ రమణ జాతీయ జెండాలు ఎగురవేశారు.

టిడిపి కార్యాలయంలో జెండాను ఎగరవేసిన ఎమ్మెల్యే

కురుపాం : స్థానిక టిడిపి కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఆదివారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల టిడిపికన్వీనర్ కెవి కొండయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, నియోజకవర్గ మహిళ కార్యదర్శి వెంపటాపు భారతమ్మ, మాజీ ఎంపిపి రమణమూర్తి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వంశీ, టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ, సుఖేష్ చంద్ర పండా, సాయి పాల్గొన్నారు.

స్థానిక జ్యుడీషియల్ ఫష్ట్ క్లాస్ మేజిస్ట్రేటు కోర్టులో న్యాయమూర్తి జె. సౌమ్యజోస్పిన్ జాతీయ జెండా ఎగురవేశారు. కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు జాతీయ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, వి. కుమార్ స్వామి, కె. అశోకుమార్, పలువురు కోర్టు కానిస్టేబుళ్లు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయురాలు నూతన తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో జె. ఉమామహేశ్వరి, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం. రవణమ్మ, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి, జిల్లా పరిషత్ స్కూల్లో హెచ్‌ఎం శంకర్రావు జాతీయ జెండాను ఎగురవేశారు.

పలువురు అధికారులకు ఉత్తమ సేవా అవార్డులు

మండలంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆర్.వేణు గోపాల్, ఎస్సై పి.నారాయణరావు, ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి కె.నాగేశ్వరరావు, తహశీల్దార్ కార్యాల సీనియర్ అసిస్టెంట్ జి. భూదేవి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బి.కాంతారావు, ఎఎస్ఒ ఎ.రవికుమార్, ఆర్ అండ్‌బి ఎఇ ఎ.సుశీల, నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గిరిజారాణి, గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వార్డెన్ పి.మల్లేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాలూరు : పట్టణంలోని శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాల లో గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.గణేశ్వరరావు జాతీయ జెండా ఎగురవేశారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.పాఠశాల కరస్పాండెంట్ కె.సాయి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు టెక్కలి ధర్మారావు జెండా ఆవిష్కరించారు.

పలువురు అధికారులు ప్రశంసాపత్రాలు

పాచిపెంట: 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన తహశీల్దార్ డి రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, సీనియర్ సహాయకులు కె జయరాజ్ కిషోర్, జూనియర్ వెటర్నరీ అధికారి గంటా రామేశ్వరరావు, వెలుగు సిసి. పడాల రామకష్ణతో పాటు పలువురు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరికి తోటి అధికారులు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మానసిక పరివర్తన తోనే గణతంత్ర ఫలితాలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి. పారి నాయుడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ సలహాదారు సి.శ్రీనివాసన్ - వేణు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం కనీస బాధ్యతగా గుర్తించి ఆచరించాలని ప్రతి ఒక్కరిలోనూ మానసిక పరివర్తన రావాలని అన్నారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమ నిర్వాహకులు వి.పద్మజ, సినీ రచయిత తుంబలి శివాజీ, జట్టు ట్రస్ట్ సిబ్బంది, జిల్లాలోని వంద గ్రామాలనుండి వచ్చిన స్వచ్ఛ ఆంధ్ర సంకల్ప మాస్టర్ ట్రైనీలు పాల్గొనడం జరిగింది.

వీరఘట్టం : మండలంలోని గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో డిటి జి.ప్రసాద్, మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ డి వెంకటరమణ నాయుడు, పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐ కృష్ణంనాయుడు, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సిహెచ్ సుధాకర్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డిజివి సత్యనారాయణ, శ్రీగాయత్రి స్కూల్, కాలేజీలో ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఎన్.సింహాచలం, ఎస్.లోకేష్, ట్రాన్స్‌కో కార్యాలయంలో ఎఇ, దశమంతపురంలో విఆర్ఒ జి.రాజేంద్ర, బొడ్లపాడులో ఎస్.రాజేశ్వరి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.

ఐటిడిఎలో గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

స్థానిక ఐటిడిఎ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో గణతంత్ర వేడుకలు ప్రాజెక్టు ఆఫీసర్ సి.యస్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల చేపట్టిన మార్చ్ ఫాస్ట్ గౌరవ వందన స్వీకరించారు. భారతి ఇంటర్నేషనల్ స్కూల్ ఇస్రో శకటాన్ని ప్రదర్శించింది. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ పౌష్టికాహారం, పోలీసులు హెల్మెట్, అడలీ యు పాయింటులో హెల్మెంట్ తప్పనిసరి అనే స్టాల్స్ ను సందర్శించారు. జిసిసి, వైద్య, వ్యవసాయశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో తాగు, సాగునీరు, ఇళ్ల వంటివి మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం హడ్డుబంగి, సీతంపేట మినీ గురుకులం సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాల, ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఐటిడిఎ పరిధిలో వివిధ శాఖలో పనిచేస్తున్న ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బంది ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపీడీవో గీతాంజలి, ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ రమాదేవి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, తహశీల్దార్ అప్పలరాజు, డి సన్యాసిరావు, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రింకర్ యూనిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల సంస్థ, ఐటిడిఎ భాగస్వామ్యంతో కురుపాం, జియ్యమ్మ వలస మండలాల్లోని 10 మంది గిరిజన రైతులకు రూ.10.05 లక్షల విలువ గల బిందు, తుంపర్ల సేద్య పరికరాలను (డ్రిప్ మరియు స్ప్రింకర్స్ ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం పంపిణీ చేశారు. 2024 - 25లో సూక్ష్మ నీటిపారుదల పథకం కింద 1,800 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్, స్ప్రింకర్ల యూనిట్లను ఉద్యాన వ్యవసాయ రైతులకు రాయితీపై అందజేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డ్రిప్, స్ప్రింకర్స్ యూనిట్స్ కలిగిన వాహనానికి పిఒ జెండా ఊపి ప్రారంభించారు. ఎపి ఎంఐపి, ఐటిడిఎ సౌజన్యంతో ఈ పథకం కింద 750 స్ప్రింకర్ల యూనిట్లను రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి వి.రాధాకృష్ణ, ఐడిడిఎ ప్రాజెక్ట్ ఉద్యానవన శాఖాధికారి కె.మణి భూషణరావు, మండల సూక్ష్మ నీటిపారుదల అధికారి శాంతిస్వరూప్, డిసిఒ కిశోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీగా కురుస్తున్న పొగ మంచు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగ మంచు భారీగా కురవడంతో ప్రధాన రహదారితో పాటు, పలు వీధులు పొగమంచుతో కప్పబడ్డాయి. స్థానిక ప్రజలు, జిల్లా కేంద్రంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర అసహనానికి గురవుతూ బయటకు రాలేని పరిస్థితి వచ్చింది. ఎన్నడూ లేని విధంగా అధిక పొగ మంచు కురవడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు, ఉదయం9 గంటల వరకు మంచు ఎక్కువగా కురవడంతో వాకింగ్ కోసం నివాస గృహాలు నుండి బయటకు వచ్చేందుకు స్థానికులు ఆసక్తి చూపించక ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణానికి పరిసర గ్రామాల నుంచి వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే వాహనచోదకులు తమ వాహనాల లైట్లు వేసుకుని రాకపోకలు సాగించే పరిస్థితి వచ్చింది. పరిసర గ్రామాల నుంచి వచ్చే కూరగాయల వ్యాపారులతో పాటు, చిన్నారులు, గర్భిణీలు, వృద్ధులు శ్వాస కోశ వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. పనులపై బయటకు వచ్చే సమయంలో ఎక్కువగా మంచు కురవడంతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్ఐ నాయకులు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - సాలూరు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పట్టణంలోని గల బంగారంపేట అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎస్.ధనుంజయ్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి అఖిల్ మాట్లాడారు. ప్రాథమిక విద్యను కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకుని పేదలను విద్యకు దూరం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. బిజెపి ప్రభుత్వ జాతీయ విద్యా విధానంలో భాగంగానే ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడమే ఈ మార్పుల సారాంశమని చెప్పారు. ఇది పచ్చి రాజ్యాంగ వ్యతిరేక చర్య అని చెప్పారు. రాష్ట్రం హక్కును కేంద్రం లాగేసినా ప్రతిఘటించకపోగా అమలు చేయడం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బీజేపీతో కలిసి రాష్ట్రానికి ద్రోహం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సూర్య , సింహాద్రి ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సంజీవ్, సునీల్, ఓబీస్, బుజ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

'ప్రజాశక్తి'తో కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఎపి రాష్ట్రం స్వర్గధామం కానుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడానికి సిఎం చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఎంతగానో కషి చేస్తున్నారని తెలిపారు. నాడు తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటిని పరిచయం చేసి ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న అపారవనరులు, మౌలిక సదుపాయాలు అత్యుత్తమ పాలసీ గురించి పారిశ్రామిక వేత్తలకు వివరించి పరిశ్రమల స్థాపనకు ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్ర శేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సిఎంను మెచ్చుకోవడం, రాష్ట్రంలో పరిశ్రమలకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరం అన్నారు. గాడి తప్పిన అన్ని రంగాలను చంద్రబాబు తిరిగి గాడిలో పెట్టడం, అభివద్ధి వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు.

28 నుంచి వికలాంగ పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 28 నుండి ఫిబ్రవరి 4 వరకు పాలకొండ ఏరియా ఆసుపత్రిలో వినికిడి లోపం ఉన్న పింఛనుదారులకు తనిఖీ జరుగుతుందని ఎంపిడిఒ ఎస్.రమేష్ విలేకరులతో అన్నారు. 28న కుదమ, 29న కన్నపు దొర వలస, చిన మేరంగి, గవరమ్మపేట, జియ్యమ్మవలస, శిఖబడి, పరజపాడు పంచాయతీలకు సంబంధించిన వినికిడి వికలాంగులు హాజరుకావాలని అన్నారు. ఫిబ్రవరి 3న అల్లువాడ, డంగభద్ర, బిజెపురం, తురకనాయుడువలస, గెడ్డ తిరువాడ, చింతల బెలగాం, ఇటిక, టికె జమ్ము పంచాయతీలకు, 4న పెదమేరంగి, కొండచిలక, తుంబలి, పెద్దబుడ్డిడి, అలమండ, బిత్రపాడు, తాళ్లడమ్మ, అంకవరం, పిటిమండ, ఆర్నాడ పంచాయితీల వికలాంగులు హాజరుకావాలని ఆయన అన్నారు.